# వరంగల్ వాయిస్

www.warangalvoice.net

Evening Daily

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 141 శుక్రవారం | 01 డిసెంబర్ 2023 | పేజీలు : 06 | వెల రూ. 5




4లో

## గోవిందా.. గోవిందా..

- ముగిసిన బుగులోని జాతర
- భారీగా తరలివచ్చిన భక్త జనం
- మూడు రోజులపాటు సాగిన ఉత్సవాలు



# హస్తం హవా..

- ఏనోట విన్నా అదే మాట
- ఎగ్జిట్ పోల్స్ అదే చెబుతోంది
- ప్రజలు నిజంగానే మార్పు కోరుకున్నారా..
- లేక నిరుద్యోగుల విజయమా..?
- కలగానే మిగిలిన హ్యాట్రిక్

రాష్ట్రంలో రాజకీయాలు ఊహించని మలుపులు తిరుగుతున్నాయి. ఎన్నికలు పూర్తి కావడంతో అధికారులు కౌంటింగ్ ఏర్పాట్లను చేస్తున్నారు. ఈవీఎంలను ఇప్పటికే స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించి పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. అభ్యర్థుల భవితవ్యం ఈనెల 3న తెలియనుంది. ఇప్పటికే అన్ని పార్టీల అభ్యర్థులు గెలుపు, ఓటములపై బేరీజు వేసుకుంటున్నారు. ఏ పోలింగ్ కేంద్రంలో ఎన్ని ఓట్లు పడ్డాయో లెక్కలు వేసుకుంటున్నారు. అయితే 'మార్పు కావాలి.. కాంగ్రెస్ రావాలి' అన్న క్యాప్షన్ కు ప్రజలు బాగా కనెక్ట్ అయినట్లు కనిపిస్తోంది. ఈ ఒక్క క్యాప్షన్‌తో కాంగ్రెస్ పార్టీ సునామీ సృష్టించిందనే చెప్పవచ్చు. ఎక్కడ చూసినా కాంగ్రెస్ హవానే కనిపించింది. మహామహులు సైతం కాంగ్రెస్ గాలిలో కొట్టుకుపోతున్నట్లు ప్రచారం సాగుతోంది. దీని కంతటికీ అధికార పార్టీ ఒంటెద్దు పోకడలే కారణంగా చెప్పుకొస్తున్నారు. నిరుద్యోగులు తిరగబడితే ఎలా ఉంటుందో ప్రభుత్వానికి రుచి చూపించారన్న ప్రచారం సాగుతోంది. తెలంగాణలో ఏమి చేసినా మేమే అంటూ విర్రవీగుతున్న వారికి ఈ ఎన్నికలు ఒక గుణపాఠం కానున్నాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. - వరంగల్ వాయిస్ ప్రతినిధి

వివరాలు 2లో..



2లో

## అయ్యప్ప పూజా విధానం పుస్తకం ఆవిష్కరణ



2లో..

## చిగిచర్ల సేవలు వెలకట్టలేనివి

జానపద గిరిజన విజ్ఞాన పీఠం పీఠాధిపతి గడ్డం వెంకన్న




## స్ట్రాంగ్ రూంల పరిశీలన

ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లోని స్ట్రాంగ్ రూంలను శుక్రవారం వరంగల్ జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి పి.ప్రావీణ్య అధికారులతో కలిసి పరిశీలించారు. నర్సంపేట, వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ, పరకాల, వర్ధన్నపేట నియోజకవర్గాలకు చెందిన ఓట్లను ఆదివారం ఏనుమాముల మార్కెట్‌లోనే లెక్కించనున్నారు.

- వరంగల్ వాయిస్, కాశిబుగ్గ

# ‘హస్తం’ హవా..


## ఏనోట విన్నా అదే మాట

### ఎగ్జిట్ పోల్స్ అదే చెబుతోంది

### ప్రజలు నిజంగానే మార్పు కోరుకున్నారా.. లేక నిరుద్యోగుల విజయమా..?

### కలగానే మిగిలిన హ్యాట్రిక్

### హంగ్ వస్తే ఎలా అంటూ చర్చలు






**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** కాంగ్రెస్ పార్టీ రాజకీయ సునామి సృష్టించనుందా? తెలంగాణలో పూర్వ వైభవాన్ని సంతరించుకోనుందా? ఈనెల 9న అధికారం చేపట్టనుందా అంటే రాజకీయ విశ్లేషకులు మాత్రం ఔననే సమాధానం చెబుతున్నారు. గతంలో ఎన్నడూ కనివినీ ఎరుగని రీతిలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అత్యధిక స్థానాల్లో విజయం సాధించి అధికారాన్ని చేజిక్కించికోనుందన్న ప్రచారం జోరందుకుంది. ఏ నోట విన్నా కాంగ్రెస్ పార్టీ జపం వినిపిస్తోంది. ఎగ్జిట్ పోల్స్ సైతం అదే చెప్పడంతో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల్లో జోష్ పెరిగింది. ఆ పార్టీ రాష్ట్ర చీఫ్ రేవంత్ రెడ్డి సైతం ఫలితాల వరకు వేచి చూడాల్సిప అవసరం లేదు..ఇప్పటినుంచే ఎక్కడికక్కడ విజయోత్సవాలు నిర్వహించాలంటూ పిలుపు నివ్వండతో ఆ పార్టీ శ్రేణులు సంబురాల్లో మునిగితేలుతున్నారు. బీఆర్ ఎస్ హ్యాట్రిక్ కలగానే మిగులుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అయితే మంత్రి కేటీఆర్ మాత్రం ఈ సర్వేలను కొట్టి పారేస్తున్నారు. తుదివిజయం తమదేనని, మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేది తామే నంటూ ఘంటాపథంగా ప్రకటిస్తున్నారు.

### నిరుద్యోగుల విజయమా..

కేసీఆర్ సర్కార్ పై నిరుద్యోగులు గుర్రుగా ఉన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలే లక్ష్యంగా ఏర్పడిన తెలంగాణలో నియామకాలు అటకెక్కాయి. పది సంవత్సరాలు అధికారంలో ఉన్నా ప్రభుత్వ ఉద్యోగాల కల్పనపై పాలకులు నిర్లక్ష్యం వహించడంపై నిరుద్యోగులు ఎదురుతిరిగారు. నిరుద్యోగుల అండతో ఉద్యమాన్ని ఉర్రూతలూగించిన కొందరు ఎమ్మెల్యేలుగా అధికారం వెలగబెట్టినప్పటికీ చేసిందేమీ లేకపోవడంతో ఓయే జేఏసీ నేతలే ఎన్నికల రంగంలోకి దూకి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచారం చేశారు. కేసీఆర్ పోతేనే కొలువులు వస్తాయన్న ప్రచారాన్ని అన్ని వర్గాలకు రీచ్ అయ్యేలా చేశారు. నిరుద్యోగుల ఆవేదనను ప్రజలకు అర్థం అయ్యేలా చెప్పారు. కొలువులు వస్తే ఉచితాలతో అవసరమే లేదన్న భావనను అందరిలో కల్పించారు. దీంతో ఉచితాలనే నమ్ముకున్న అధికార పార్టీ బొక్క బోర్ల పడింది. దీంతో నిరుద్యోగుల ఆవేదన, ఆకాంక్ష పై చేయి సాధించిందనే చెప్పవచ్చు.

### హంగ్ వస్తే ఎలా..

అసెంబ్లీ ఎన్నికల్లో నువ్వా.. నేనా అన్నట్లుగా అధికార బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు పోటీ పడ్డాయి. ఈ నేపథ్యంలో ఫలితాలు ఎలా వస్తే ఎలా స్పందించాలన్న దానిపై ముందుగానే అన్ని రాజకీయ పార్టీలు ప్లాన్ రెడీ చేసుకుంటున్నాయి. తేడా కొడితే ఏం చేయాలన్న దానిపై సమాలోచనలు చేస్తున్నాయి. ఒకవేళ హంగ్ వస్తే ఏం చేయాలన్న ఆలోచనల్లో తలమునకలయ్యారు. ఓ రెండు పార్టీలు కలిసి ఖచ్చితంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అయితే ఆ రెండు పార్టీలు ఏవరన్నది ఇప్పుడు కీలకంగా మారింది. ఎందుకంటే రెండు జాతీయ పార్టీలు కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే చాన్సే లేదు. బీజేపీలో కూడా హంగ్ వస్తుందన్న భావనే వ్యక్తమవుతోంది. హంగ్ వస్తే తమదే విజయం అన్న ధీమాలో బీఆర్ఎస్ ఉంది. అయితే ఏ జాతీయ పార్టీతో కలుస్తుందనే చర్చ సాగుతోంది. ఎన్నికలకు ముందు నుంచే బీజేపీ, బీఆర్ఎస్, ఐఎంఐఎంలు అవగాహనతో ఉన్నాయన్న ప్రచారం ఉంది. మొత్తం 119 సీట్లున్న అసెంబ్లీలో సాధారణ మెజార్టీ రావాలంటే 60 స్థానాల్లో విజయం సాధించాల్సి ఉంటుంది. ఈ విషయంలో బీఆర్ ఎస్ కు ప్రత్యేకమైన అడ్వాంటేజ్ ఉంది. ఆ పార్టీకి 60 సీట్ల అక్కర్లేదు. 50 సీట్లు వచ్చినా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలుగుతుంది. ఎందుకంటే.. మజ్లిస్ పార్టీ బీఆర్ఎస్‌కు ఏకపక్షంగా మద్దతు పలుకుతుంది. అలాగే బీజేపీ కూడా పరోక్ష లేదా ప్రత్యక్ష మద్దతు ఇచ్చేందుకు సిద్దంగా ఉంది. రెండు పార్టీల మధ్య ఆ అవగాహన ఉంటుంది. ఎలా చూసినా మజ్లిస్‌కు ఆరు నుంచి ఏడు స్థానాలు ఖాయం. దీంతో రెండు జాతీయ పార్టీలు తెలంగాణలో మరోసారి అధికారానికి దూరం అవుతాయి. అయితే మెజారిటీ ఎగ్జిట్ పోల్స్ బీఆర్ఎస్‌కు ఇన్ని స్థానాలు ఇవ్వడం లేదు. మజ్లిస్ మద్దతు కూడా సరిపోనంత తక్కువగా బీఆర్ఎస్‌కు సీట్లు వస్తే.. ఆ పార్టీ అధికారంలోకి వచ్చే అవకాశం లేదు. ఒకవేళ బీఆర్ఎస్‌కు 45 సీట్లు వచ్చినా బీజేపీ కనీసం 15 సీట్లు వస్తే ఆ పార్టీలో చర్చలు జరిపేందుకు అవకాశం ఉంది. మజ్లిస్ ను పూర్తిగా పక్కన పెట్టేస్తే.. బీజేపీకి అంత కన్నా ఎక్కువ సీట్లు వచ్చి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగితే ఆ రెండు పార్టీలు కలిసే చాన్స్ ఉంటుంది. ఎందుకంటే.. కాంగ్రెస్‌ను అడ్డుకునేందుకు బీజేపీ తమవంతు ప్రయత్నం చేస్తుంది. దానికి తగ్గట్లుగా రాజకీయాలు చేయడంలో బీజేపీ రాటుదేలిపోయింది. ప్రభుత్వ ఏర్పాటుకు తమపై ఆధారపడే అన్ని సీట్లు సాధించాలని పార్టీ నేతలకు ఎన్నికలకు ముందే దిశానిర్దేశం చేశారన్న ప్రచారం సాగింది. పార్టీ పూర్తి స్థాయిలో మెజార్టీ సాధించడం కష్టమైన పరిస్థితుల్లో బీజేపీ అదే వ్యూహాన్ని అమలు చేసిందని చెబుతున్నారు. ఎన్నికల ఫలితాల ముందు రాజకీయాలకు.. ఎన్నికల ఫలితాల రాజకీయాలకు సంబంధం ఉండదు. అప్పటి రాజకీయాలు అప్పటివే. బీఆర్ఎస్, బీజేపీ పొత్తుల్ని ఎవరూ కాదనలేరు.

### కాంగ్రెస్ ఎం చేస్తుంది..

ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేంత మెజార్టీ రాకపోతే కాంగ్రెస్ ఏం చేస్తుందన్నది కూడా ప్రశ్నే. అయితే కాంగ్రెస్‌కు కూడా ఎంఐఎం మద్దతుగా నిలుస్తుంది. ఎంఐఎం కూడా ఇలాంటి పరిస్థితి రావాలనే కోరుకుంటుంది. గతంలో అసెంబ్లీలో అక్బరుద్దీన్ ఇలాంటి ప్రకటన చేసిన సందర్భం ఉంది. నిజానికి తెలంగాణ ఎన్నికలు ఇతర పార్టీల కంటే.. కాంగ్రెస్ కు అతి పెద్ద సవాల్. కాంగ్రెస్ మెజార్టీ మార్క్ ను తెచ్చుకుంటే... ఏ సమస్యా ఉండదు. ఓ సారి కాంగ్రెస్ సీఎం ప్రమాణ స్వీకారం చేస్తే.. ప్రభుత్వాన్ని కాపాడుకోవడానికి ఏం చేయాలో అది చేస్తారు. గతంలో కేసీఆర్ చూపించిన దారిలోనే వెళ్లవచ్చు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే.. ఆ ప్రభుత్వానికి మజ్లిస్ మద్దతు తెలుపుతుంది. అందులో సందేహం లేదు. కానీ ప్రభుత్వం ఏర్పాటుకు సీట్లు తగ్గితే కాంగ్రెస్ ఏంచేస్తుందన్నది చర్చగా మారింది. బొటాబొటీగా 60 సీట్లు వచ్చినా కాంగ్రెస్ అధికారం ఏర్పాటు చేయడం ఖాయం. లేకుంటే మజ్లిస్ మద్దతు ఇచ్చేంత సీట్లు రావాలి. ఒక వేళ అధికారంలో భాగం పంచుకోకపోతే గెలిచిన ఎమ్మెల్యేలు కాంగ్రెస్ వెంట ఉంటారనే గ్యారెంటీ లేదు. అప్పుడు బిఆర్ఎస్‌లో గెలిచినా, బీజేపీలో గెలిచినా గోడ దూకడం ఖాయం.

తెలంగాణ ఫలితాల్లో హంగ్ అంటూ వస్తే అసలు పరీక్ష కాంగ్రెస్ పార్టీకే ఎదురవుతుంది. పదేళ్లుగా అధికారానికి దూరంగా ఉన్న పార్టీకి ఎమ్మెల్యేల్ని కాపాడుకోవడం పెద్ద సమస్య అవుతుంది. మరో ఐదేళ్లు ప్రతిపక్షంలో పోరాడటం సమస్యగా మారుతుంది. అలాగని బీఆర్ఎస్ పార్టీ కూడా ఎమ్మెల్యేలను కాపాడుకోవడం కష్టమే. ఒక వేళ మజ్లిస్ తో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగే సీట్లు తెచ్చుకున్నా... అది ముళ్లబాటే అవుతుంది. అందుకే పూర్తి మెజార్టీ రావాలని కాంగ్రెస్ కోరుకుంటోంది.

### క్యాబినెట్ సమావేశం అంటూ చర్చ..

ఒక వైపు కాంగ్రెస్ పార్టీ నేతలు తామె అధికారంలోకి వస్తున్నామంటూ ప్రచారం సాగిస్తుండగా బీఆర్ ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు సీఎంఓ నుంచి ఈ నెల 4న రాష్ట్ర క్యాబినెట్ సమావేశం అంటూ నోట్ విడుదల కావడం చర్చనీయాంశంగా మారింది. అన్ని సర్వేలు, ఎగ్జిట్ పోల్స్ కాంగ్రెస్ కు అనుకూలంగా చెబుతున్నప్పటికీ క్యాబినెట్ సమావేశం ఏర్పాటుపై అయోమయం నెలకొంది. అయితే ఈ విషయంలో కేసీఆర్ క్లారిటీగా ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. బీజేపీ, ఎంఐఎంలతో కలిసి ముచ్చటగా మూడో సారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేది బీఆర్ ఎస్సే నన్న నమ్మకంతో కేసీఆర్ ఉన్నట్లు తెలుస్తోంది.

# చిగిచర్ల సేవలు వెలకట్టలేనివి

## జానపద గిరిజన విజ్ఞాన పీఠం పీఠాధిపతి గడ్డం వెంకన్న



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఉభయ తెలుగు రాష్ట్రాల్లో జానపద కళాకారుల అభ్యున్నతికి ఆచార్య చిగిచర్ల కృష్ణారెడ్డి చేసిన సేవలు వెలకట్టలేనివని జానపద గిరిజన విజ్ఞాన పీఠం పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న అన్నారు. శుక్రవారం వరంగల్ హంటర్ రోడ్డులోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞానపీఠం సెమినార్ హాల్లో వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్ మెంట్ పురస్కారాన్ని పొందిన జానపద కళల శాఖ పూర్వ శాఖాధిపతి ఆచార్య చిగిచర్ల కృష్ణారెడ్డి అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న సభాధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆచార్య కృష్ణారెడ్డిని పీఠం అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. అనంతరం వెంకన్న మాట్లాడుతూ జానపద గిరిజన విజ్ఞాన పీఠం ఏర్పాటు నుంచి కృష్ణారెడ్డి తన వంతు తోడ్పాటు అందించి పీఠం అభివృద్ధిలో భాగస్వామ్యం పొందడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం సీనియర్ అధ్యాపకులు ఆచార్య భూక్య బాబురావు మాట్లాడుతూ ఒకవైపు అధ్యాపక వృత్తిని చేపడుతూనే, మరొకవైపు జానపద కళల అభివృద్ధికి ఆచార్య కృష్ణారెడ్డి కృషి చేయడం గొప్ప విషయమని అన్నారు. అనంతరం సన్మాన గ్రహీత ఆచార్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతిష్టాత్మక వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్ మెంట్ అవార్డు పొందడం గర్వంగా ఉందన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని జానపద కళాకారులకు తనవంతుగా సేవలందించి ఆర్థికంగా నిలదొక్కుకునేలా సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీఠం అధ్యాపకులు డాక్టర్ శ్రీమంతుల దామోదర్, డాక్టర్ చూరేపల్లి రవికుమార్, డాక్టర్ బాసని సురేష్, అబ్బు గోపాల్ రెడ్డి, గంప సతీష్, పరవస్తు విజయలక్ష్మి, సిద్దోజు సునంద, ఆంజనేయులు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప పూజా విధానం పుస్తకం ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** శ్రీ పరంజ్యోతి భజన మండలి వ్యవస్థాపకుడు రాచర్ల జగన్ గురుస్వామి రూపొందించిన ‘అయ్యప్ప పూజా విధానం’ పుస్తకాన్ని ప్రభుత్వం చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ శుక్రవారం భద్రకాళి దేవాలయం ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వినయ్ భాస్కర్ మాట్లాడుతూ ఎంతో పవిత్రమైనది అయ్యప్పమాలని, ఈ దీక్ష మనిషిలోని సుగుణాలను వెలికి తీస్తుందని, అయ్యప్పలు నిస్వార్థంగా వ్యవహరిస్తారని, దీని ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యంతోపాటు ఆధ్యాత్మిక చింతన లభిస్తుందన్నారు. ప్రతి ఏడు ఈ దీక్షను తీసుకునే భక్తుల సంఖ్య పెరుగుతోందన్నారు. ఈ సందర్భంగా 3,500 పుస్తకాలను అయ్యప్ప మాలదారులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భద్రకాళి ప్రధాన అర్చకుడు భద్రకాళి శేషు, విజయ్ యాదవ్, ఎం.శేషగిరి రావు, రాజు, మహేందర్, సతీష్, సంతోష్, బాలు, సదాంత్, శోభన్ తోపాటు కన్నెస్వాములు, గురు స్వాములు పాల్గొన్నారు.

# ఓటేసిన ప్రజలకు కృతజ్ఞతలు

## కాంగ్రెస్ నేత జంగా రాఘవరెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేసినందుకు గాను, అదేవిధంగా కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసినందుకు గాను కాంగ్రెస్ నేత, మాజీ డీసీసీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటా

## కాంగ్రెస్ అభ్యర్థి మురళి నాయక్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** స్థానిక క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మురళి నాయక్ శుక్రవారం కృతజ్ఞత సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులకు, అలాగే మండల పార్టీ అధ్యక్షులకు, గ్రామ పార్టీ అధ్యక్షులకు, మహబూబాబాద్ వార్డు కౌన్సిలర్లకు, కార్యకర్తలకు, అన్నదమ్ములకు, అక్కచెల్లెళ్లకు, మహబూబాబాద్ యూత్ కాంగ్రెస్ సభ్యులకు, సోషల్ మీడియా, ప్రింట్ మీడియాకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సమావేశ ముఖ్య ఉద్దేశం ఏంటంటే ఇన్ని రోజులు నా గెలుపు కోసం మీరు శ్రమించినందుకు ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటానన్నారు. అలాగే ప్రతి కార్యకర్తను తాను కాపాడుకుంటానని, ఎవరెన్ని కుట్రలు చేసినా బీఆర్ఎస్ పార్టీ ఎన్ని కుతంత్రాలు చేసినా ప్రజలు నాకు పూర్తి స్థాయి మద్దతును ఇచ్చారని తెలిపారు. నా గెలుపు కోసం మీరు నిత్యం ప్రజలలో ఉంటూ కాంగ్రెస్ పార్టీ గురించి నా గురించి ప్రజలకు వివరిస్తూ పూర్తిస్థాయిలో ఓటింగ్ జరిగే విధంగా సహకరించినందుకు ప్రత్యేక ఈ ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే ప్రభుత్వం వచ్చిన వెంటనే ప్రతి నిరుపేద లబ్ధిదారునికి కాంగ్రెస్ పార్టీ ఆరు సంక్షేమ పథకాలను అందజేస్తామని మహబూబాబాద్ ను అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు.

# పరకాలలో అంతిమ విజయం బీజేపీదే

## మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి



**వరంగల్ వాయిస్, పరకాల :** బీజేపీ గెలుపుతో పరకాలను చక్కదిద్దుతామని పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి హామీ ఇచ్చారు. శుక్రవారం పరకాల పట్టణంలో పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, బీజేపీ రాష్ట్ర నాయకులు దేవు సాంబయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి, డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మొలుగూరి మాట్లాడుతూ పరకాలలో బీజేపీ అంతిమ విజయం సాధిస్తుందని అన్నారు. అస్తవ్యస్తంగా ఉన్న పరకాలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు బీజేపీ కట్టుబడి ఉంటుందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను వ్యతిరేకిస్తూ ప్రజలు మార్పు కోరుకున్నారని, ప్రజలంతా బీజేపీని గెలిపించేందుకు కృషి చేశారని అన్నారు. ఆ పార్టీలు ఎన్ని జిమ్మిక్కులు చేసినా ప్రజలు ఆ పార్టీలను నమ్మకుండా బీజేపీ వైపే ఉన్నారని తెలిపారు. ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ బీజేపీ పార్టీ పుంజుకుందని 29న ప్రతి ఒక్కరూ బీజేపీకి ఓటు వేస్తామని తెలిపారని అన్నారు. బీజేపీ గెలుపు కోసం కృషిచేసిన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి, దేవు సాంబయ్య, సిరంగి సంతోష్ కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలో బీజేపీ గెలుస్తుందని, గెలవడంతోనే పార్టీలకతీతంగా పరకాల అభివృద్ధికి కృషి చేస్తుందని గుర్తు చేశారు.

# భక్తులకు మహా అన్నదానం



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలో సుప్రసిద్ధ శైవక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ కుంకుమేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీక మాసోత్సవ పూర్వక వజ్రగధిత పాశుపత మహా రుద్ర యాగ సహిత ఆకాశ దీపోత్సవ మహా అన్నదాన మహోత్సవాలు బ్రహ్మశ్రీ కోమాళ్లపల్లి సంపత్ కుమార్ శర్మ ఆచార్యత్వమున అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. కార్తీక మాసం ప్రారంభం నుంచి నేటి వరకు శ్రీ కుంకుమేశ్వర స్వామి ఆలయంలో నిత్యం మహా అన్నదాన కార్యక్రమాలను దాతల సహాయ సహకారాలతో నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ గందె వెంకటేశ్వర్లు తెలిపారు. నిత్య అన్నదాన కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం బొజ్జం నర్సక్క -ఆనందం దంపతులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పరకాలకు చెందిన భూషి భారతి -ప్రభాకర్ రెడ్డి దంపతులు స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదంతో పాటు అల్పాహారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తో పాటు ధర్మకర్తల మండలి ఆలయ వంశానుగత అర్చకులు కోమాళ్లపల్లి నాగభూషణ శర్మ, ఆలయ కార్యనిర్వాహణాధికారి వెంకటయ్య భక్తులు పలువురు పాల్గొన్నారు.

# ప్రజలకు హెచ్ఐవీపై అవగాహన అవసరం




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** నేడు ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ఐఎంఏ హాల్ పత్తిపాక రోడ్డులో డాక్టర్ అంబరీష్, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ బిందుశ్రీ ఆధ్వర్యంలో, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ “%యావ్ జశీఎఎబఅఱ్‌అవం ాావస%” అనే నినాదంతో బుధవారం మనం ఎయిడ్స్ దినం జరుపుకుంటున్నామన్నారు. మన జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో హెచ్ఐవి ఉన్న గర్భిణీ స్త్రీలకు సుఖ ప్రసవం జరగగా తల్లికి మరియు బిడ్డకు మందులు అందించడం జరిగింది. జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో 3770 మంది సుఖ వ్యాధులు సోకిన వారిని గుర్తించి చికిత్స అందించడం జరిగిందని, అదేవిధంగా జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో 1415యూనిట్ల రక్తం సేకరించి వినియోగించినామన్నారు. జిల్లాలో 17రక్తదాన శిబిరాలు నిర్వహించి 670యూనిట్ల రక్తం కూడా సేకరించడం జరిగింది. హెచ్ఐవీ సోకిన వ్యక్తులు వివక్షతకు గురికాకుండా ఆత్మస్థైర్యంతో మంచి జీవితం గడుపుటకు 1412 మందిని పీఎల్ హెచ్ఐవీ నెట్ వర్క్ తో అనుసంధానం కూడా చేశామన్నారు. హెచ్ఐవీ సోకిన వారికి టీబీ పరీక్ష చేయించుటకు గాను, అదే విధంగా హెచ్ఐవీ రక్త పరీక్ష కేంద్రాలకు ఏఆర్టీ కేంద్రాలను తెమడ పరీక్ష కేంద్రాలతో అనుసంధానం చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో అన్ని డిగ్రీ, జూనియర్ కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్ లను స్థాపించి హెచ్ఐవీ ఎయిడ్స్ పై అవగాహన కల్పించడం, అదేవిధంగా రక్తదాన శిబిరాలను కూడా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలో ప్రమాదకర గ్రూపులైన స్వలింగ సంపర్కులు, ఫిమేల్ సెక్స్ వర్కర్స్, వలస కార్మికులు, ఆటోడ్రైవర్లు హెచ్ఐవీకి గురి కాకుండా వారి ద్వారా ఇతరులకు వ్యాపించకుండా మూడు స్వచ్ఛంద సేవ సంస్థలు జిల్లాలో పనిచేస్తున్నాయన్నారు. హెచ్ఐవీ ఉన్న వ్యక్తులకు కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ప్రజలకు అవగాహన కల్పించుటకు ముఖ్యమైన కూడళ్లలో, ఆసుపత్రులలో సమాచార హోర్డింగ్స్, వాల్ రైటింగ్ కూడా చేశామని చెప్పారు. జిల్లా కలెక్టర్, జిల్లా న్యాయ సేవా సంస్థ సహాయంతో హెచ్ ఆర్ జీఎస్ కు 10కేజీల బియ్యం ఇస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కాలేజ్, డిగ్రీ కాలేజ్ విద్యార్థిని విద్యార్థులకు హెచ్ఐవీపై క్విజ్ కార్యక్రమం, డ్రామా, మారథాన్ పెట్టి బహుమతితో పాటు సర్టిఫికెట్, క్యాష్ ప్రైజ్ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా హెచ్ఐవీ ఎయిడ్స్ పై అవగాహన కల్పించి ఉత్తమ సేవలు అందించిన వైద్యాధికారులకు, ఆశా కార్యకర్తలకు, ఆరోగ్య కార్యకర్తలకు, స్వచ్ఛంద సంస్థలకు ప్రశంసా పత్రాలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్స్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, జిల్లా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకట్ రాములు, ఆర్ఎంఓ డాక్టర్ వైదేహి, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మురళీధర్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుధీర్ రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నాగేశ్వరరావు, రెడ్ క్రాస్ చైర్మన్ వరప్రసాద్, ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ నెహ్రూ నాయక్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్. శ్రవణ్ డీపీఎంఓ రవీందర్రావు, సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస్, హెల్త్ ఎడ్యుకేటర్ మహేందర్ రెడ్డి, కేవీరాజు, డీపీహెచ్ఎన్ఓ మంగమ్మ, ఆశా కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఎయిడ్స్‌ను అంతమొందించొచ్చు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఏవీవీఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కొడిమాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో హెచ్ఐవీ ఎయిడ్స్ పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఐవీ /ఎయిడ్స్ మాస్టర్ ట్రేట్నర్ కొడిమాల శ్రీనివాసరావు మాట్లాడుతూ హెచ్ఐవీ ప్రాణం తకమైన వైరస్ అని, దీనిని నిర్మూలించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, దీనికి సమాజంలోని వివిధ పౌర సంఘాలు నాయకత్వం వహించి 2030 వరకు హెచ్ఐవీని అంతమొందించే లక్ష్యంగా చేసుకొని అవగాహన కార్యక్రమాలు, చైతన్య కార్యక్రమాలు ముమ్మరం చేసి లక్ష్యాన్ని సాధించాలని తద్వారా ఈ భయంకర వైరస్ ను అంతమొందించాలని లేకుంటే అది మనల్ని అంతమొందిస్తదని అన్నారు. ర్యాలీ అనంతరం జిల్లా వైద్యశాఖ నిర్వహించిన ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం కార్యక్రమంలో శ్రీనివాసరావును షీల్డ్, ప్రశంసా పత్రంతో వరంగల్ జిల్లా వైద్య శాఖ అధికారులు అభినందించారు. ప్రమోద్ కుమార్, నవదీప్, కార్తికేయ, ముస్కాన్, సీమ, ప్రవీణ్, సీనియర్ వాలంటీర్ వినయ్ పాల్గొన్నారు.

# కాజీపేటలో దారుణం

## మహిళను ఢీ కొట్టిన కారు

## ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాజీపేట సెయింట్ గ్యాబ్రియల్ స్కూల్ నుంచి బయటికి వచ్చి బైక్ ఎక్కుతున్న కవిత ను కారు ఢీకొంది. దీంతో మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. బాధిత మహిళకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కారుతో ఆక్సిడెంట్ చేసిన వ్యక్తి ఎక్సయిజ్ సీఐ శరత్ కొడుకు వంశీ కావడంతో పోలీసులు పట్టించుకోవడం లేదని మృతురాలి బంధువులు ఆరోపిస్తున్నారు. నిన్నటి నుంచిపోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతున్నా తమకు న్యాయం చేయడం లేదని మృతురాలి బంధువుల ఆందోళనకు దిగారు. పోలీస్ అధికారి కొడుకుని కాపాడే ప్రయత్నం చేస్తున్నారని బంధువుల ఆరోపిస్తున్నారు. తమకు న్యాయం చేయాలని ఫాతిమా నగర్ జంక్షన్ లో శుక్రవారం ధర్నాకు దిగారు. దీంతో ఈ ప్రాంతంలో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

వరంగల్ వాయిస్ Evening Daily
శుక్రవారం 01, డిసెంబర్ 2023
www.warangalvoice.net

# ముగిసిన బుగులోని వేంకటేశ్వర స్వామి జాతర

**భారీగా తరలివచ్చిన భక్తజనం**
**నేటితో ముగియనున్న బుగులోని జాతర**

**వరంగల్ వాయిస్, రేగొండ :** మండలంలోని తిరుమలగిరి చివరిలో కొలువుదీరిన సుప్రసిద్ధ దేవస్థానం తెలంగాణ రెండో తిరుపతిగా పేరుగాంచిన శ్రీ బుగులోని వేజెంకటేశ్వర స్వామి జాతర శుక్రవారం వైభవంగా ముగిసింది. బుగులోనే గుట్టల్లో వెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామి అలివేలు మంగ, పద్మవతి కళ్యాణ ఉత్సవాలను ప్రతి ఏటా కార్తీక పౌర్ణమి సందర్భంగా తేదీ 26న ప్రారంభమై ఐదు రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. వంశీయ అర్చకులు కూర్మాచలం వెంకటేశ్వర్లు తన ఇంటి నుంచి వేంకటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాన్ని గుట్టకు చేర్చడంతో జాతర ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. చుట్టూ ఎత్తైన కొండలు ఎటు చూసినా పచ్చదనం, చల్లని ఆహ్లాదాన్ని కలిగించే వాతావరణం భక్తజన సంద్రంలో గోవింద నామస్మరణ నడుమ రమణీయంగా కొనసాగుతున్న వేంకటేశ్వర స్వామి వారిని భక్తులు ఎంతో భక్తపారవశ్యంతో మొక్కులు చెల్లించుకున్నారు .రేగొండ పోలీసుల సూచనలను అనుసరిస్తూ కొండపైకి గోవిందా నామ స్మరణ చేసుకుంటూ స్వామివారిని దర్శించుకున్నారు. మొదట గుట్ట కింద ఉన్న పాలగుండంలో స్నానాలు ఆచరించి స్వామివారికి తలనీలాలు సమర్పిస్తున్నారు. స్వామివారి దర్శనం అనంతరం గరుడ దీపం వద్ద తమ పాపాలను హరించాలని దీపంలో నూనె వేసి స్వామివారిని వేడుకోవడం అనవాయితీగా కొనసాగుతోంది. గుట్టపై నుంచి భారీ ఊరేగింపుల నడుమ తిరుమలగిరి గ్రామంలోని అర్చకులు వెంకటేశ్వర్లు ఇంటికి ఉత్సవ విగ్రహాన్ని చేర్చడంతో జాతర ఉత్సవాలు ముగిశాయి.



ప్రతి ఏటా కార్తీక మాసంలో కార్తీక పౌర్ణమి రోజునుంచి ఐదు రోజుల పాటు జరిగే శ్రీ వేంకటేశ్వరస్వామి వారి జాతర ప్రతి సంవత్సరం నాలుగు రోజులు నిర్వహించే జాతర ఈ సారి అసెంబ్లీ ఎన్నికల కారణంగా ఈ ఏడాది భక్తుల కోరికమేరకు ఒక రోజు పెంచడంతో భక్తులకు అనుకూలంగా స్వామివారి దర్శనం కలిగిందని భక్తులు హర్షం వ్యక్తం చేశారు. భక్తులు గండ దీపం వద్దకు వెళ్లేందుకు ఆసక్తి చూపారు. గండ ద్వీపం వద్దకు వెళ్ళే దారిలో యువీ యువకులు సెల్ఫీ దిగుతూ సందడి చేశారు. కాగా స్వామి వారి జాతర నేటితో ముగియనున్నట్టు కార్యనిర్వహణ అధికారి బిల్లా శ్రీనివాస్ తెలిపారు. ఐదురోజుల పాటు జరిగిన జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విజయవంతం చేసినందుకు భక్తులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

### జాతరలో మెరుగైన వైద్య సేవలు..



ఐదు రోజుల పాటు వైభవంగా జరిగిన శ్రీ బుగులోని వేంకటేశ్వరస్వామి జాతరలో రేగొండ పీహెచ్ సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హిమబిందు ఆధ్వర్యంలో మెరుగైన వైద్యం అందించారు. వైద్య బృందం భక్తుల కోసం ఆనందంగా పని చేశారు.

### శభాష్ పోలీస్..




బ్రహ్మోత్సవాలకు వచ్చిన భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రేగొండ పోలీస్ వారి బందోబస్తుకు పలువురు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈసారి అసెంబ్లీ ఎన్నికలు ఉన్నా కూడా వన్వే ఏర్పాటు చేయడం పట్ల మరింత హర్షం వ్యక్తం చేస్తున్నారు. రేగొండ పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించినట్లు ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.

### నేటితో ముగిసిన జాతర..





# కొత్త ఎక్సైజ్ పాలసీ అమలు

**వైన్స్ టెండర్లు దక్కించుకున్నోళ్లకు రెండేండ్లు ఛాన్స్**
**నవంబర్‌లో రూ.2,200 కోట్ల మద్యం అమ్మకాలు**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్రంలో శుక్రవారం నుంచి కొత్త ఎక్సైజ్ పాలసీ (2023–25) అమల్లోకి రానుంది. రాష్ట్రవ్యాప్తంగా 2,620 వైన్ షాపుల లైసెన్సు గడువు నవంబర్ 30వ తేదీతో ముగిసింది. ముందస్తుగా ఆగస్టు నెలలో నిర్వహించిన టెండర్లలో వైన్ షాపుల లైసెన్స్ లు దక్కించుకున్నవారు డిసెంబర్ 1 నుంచి రెండేండ్ల పాటు మద్యం దుకాణాలను నిర్వహించనున్నారు. వైన్ షాపుల టెండర్లకు ఆగస్ట్ లో నోటిఫికేషన్ ఇవ్వగా 2,620 వైన్స్ లకు 1,31,490 అప్లికేషన్లు వచ్చాయి. సర్కార్ కు దరఖాస్తుల ద్వారానే రూ.2,629 కోట్ల ఆదాయం వచ్చింది. ఇక నవంబర్‌లో దాదాపు రూ.2,200 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. నెలాఖరులోగా పాత స్టాక్‌ను క్లియర్ చేశారు. ఒక్క నెలలోనే 21.69 లక్షల లిక్కర్ కేసులు, 30.44 లక్షల కేస్ల బీర్లు సేల్ అయ్యాయి. ఎన్నికల వేళ జనాలు బీర్లను విపరీతంగా తాగారు. జనాలు, ప్రచారానికి వెళ్లిన కార్యకర్తలు, లీడర్లు ఎవరు కూడా ఛీప్ లిక్కర్ పై




ఇంట్రస్ట్ చూపలేదని తెలుస్తోంది. మద్యం ప్రియులు మినిమం బ్రాండ్ నే మెయింటైన్ చేసినట్లు చర్చ జరుగుతోంది. ఆయా రాజకీయ పార్టీల దావతుల్లో రాయల్ స్టాగ్, బ్లెండర్స్ ప్రైడ్ వంటి బ్రాండ్స్ వైపే ఎక్కువగా మొగ్గు చూపారు. దీంతో ఛీప్ లిక్కర్ తక్కువగా అమ్ముడుపోయినట్లుగా ఆ కంపెనీల ప్రతినిధులు చెబుతున్నారు.

# ఉత్తమ సేవలలో ఐసీటీసీ

**అవార్డు అందుకున్న కౌన్సిలర్ రమేష్**
**ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాస్**



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** వరల్డ్ ఎయిడ్స్ డే సందర్భంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో భూపాలపల్లి పురపాలక కార్యాలయం సమావేశం మందిరంలో హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధి నియంత్రణలో ఉత్తమ సేవలు అందించిన సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల వ్యక్తులకు సర్టిఫికెట్లతో పాటు మెమొంటో అవార్డులను బహుకరించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సివిల్ కోర్టు జడ్జి జస్టిస్ జయరాం రెడ్డి చేతుల మీదుగా మహాదేవపూర్ సామాజిక ఆరోగ్య కేంద్రం ఐసీటీసీ కౌన్సిలర్ గాదె రమేష్, ల్యాబ్ టెక్నీషియన్ తెరులుమర్తి శ్రీనివాస్ , చిట్యాల కౌన్సిలర్ మహేందర్, సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మధుసూదన్, జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొమురయ్య, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఉమాదేవి, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ అన్వేషిని ,మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు వైద్య సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



# చాలాకాలం తరవాత ప్రశాంతంగా నిద్రపోయా

**ఎగ్జిట్ పోల్స్ తిప్పితిప్పి చెబుతున్నాయి**
**అసలు ఫలితాలు మాకు అనుకూలంగా ఉంటాయి**
**మంత్రి కేటీఆర్ ట్వీట్**



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** చాలా కాలం తర్వాత రాత్రి కంటి నిండా నిద్రపోయానని తెలంగాణ మంత్రి కేటీఆర్ అన్నారు. ఈమేరకు కేటీఆర్ ట్వీట్ చేశారు. 'ఎగ్జిట్‌పోల్స్ ఫలితాల్లో అతిశయోక్తులు ఉన్నాయి. అసల్కెన ఫలితాలు మాకు శుభవార్తలు చెబుతాయని కేటీఆర్ పేర్కొన్నారు. గురువారం పోలింగ్ అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ 88 సీట్లు వస్తాయని భావించామని, వేర్వేరు కారణాల వల్ల 70కి పైగా స్థానాల్లో తమ పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. మంత్రి కేటీఆర్ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటారు. శుక్రవారం ఆయన ఒక ఆసక్తికర ట్వీట్ చేశారు. చాలా రోజుల తర్వాత ప్రశాంతంగా నిద్రపోయానని ట్విటర్ వేదికగా కేటీఆర్ వెల్లడించారు. ఆ తరువాత ఎగ్జిట్‌పోల్స్‌పై కూడా స్పందించారు. అయితే ఎగ్జిట్‌పోల్స్ అనంతరం ఆయన చెప్పిన మాటనే తిప్పి తిప్పి చెబుతున్నారు. ఎగ్జిట్ పోల్స్ అనేవి పొలిటికల్ హీట్‌ను పెంచవచ్చు కానీ ఎగ్జాక్ట్ పోల్స్ మాత్రం పక్కాగా శుభవార్తను అందజేస్తాయని పేర్కొన్నారు. నిన్న పోలింగ్ ముగియగానే కొన్ని సర్వే సంస్థలు ఎగ్జిట్ పోల్స్‌ను విడుదల చేశాయి. అధికార పార్టీ అయితే ఈ ఎగ్జిట్ పోల్స్‌ను నమ్మడం లేదు. మంత్రి కేటీఆర్ 70కి పైగా స్థానాల్లో అధికారంలోకి వస్తామని ఇప్పటికీ చాలా నమ్మకంగా చెబుతున్నామన్నారు. రియల్ పోల్ రిజల్ట్ డిసెంబర్ 3న వస్తుంది కాబట్టి కార్యకర్తలు ఎవరూ కంగారపడవద్దని సూచిస్తున్నారు. డిసెంబర్ 3న తప్పని తేలితే ఎగ్జిట్ పోల్స్ చేసినవారు ప్రజలకి క్షమాపణ చెబుతారా అని మరీ ప్రశ్నిస్తున్నారు.



# తంగలాన్ డబ్బింగ్‌లో మాళవిక బిజీ

మాళవిక మోహనన్ సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటారు. తీరిక దొరికిన ప్రతిసారీ అభిమానులతో ముచ్చటిస్తుంటారు. తన సినిమాలకు సంబంధించిన అప్‌డేట్‌లను ఇస్తుంటారు. ప్రస్తుతం ఆమె విక్రమ్ హీరోగా రూపొందుతోన్న 'తంగలాన్'లో నటిస్తున్నారు. తాజాగా విడుదల చేసిన టీజర్‌లో మాళవిక తన లుక్‌తో అందరినీ ఆశ్చర్యపరిచారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించి అప్‌డేట్‌ను ఇస్తూ మాళవిక చేసిన పోస్ట్ వైరల్‌గా మారింది. 'వైవిధ్యమైన కథతో రూపొందుతున్న సినిమా ఇది. చిత్రీకరణ పూర్తయింది. ఇటీవల డబ్బింగ్ పనులు మొదలయ్యాయి. సినిమా మేకింగ్‌లో నాకు అన్నిటికంటే కష్టమైన పని డబ్బింగ్ చెప్పడం. నేను ఈ సినిమాకు డబ్బింగ్ చెప్పేటప్పుడు ఎవరైనా వచ్చి నాచేయి పట్టుకుని ధైర్యానిస్తారా?' అంటూ సరదాగా పోస్ట్ పెట్టారు. ఇలాంటి పోస్ట్ పెడితే నెటిజన్లు ఊరుకుంటారా? 'నేను రెడీ అంటే నేను రెడీ.. డబ్బింగ్ థియేటర్‌లో నీ పక్కనే కూర్చుని ధైర్యం చెబుతా' అంటూ ఫన్నీ కామెంట్స్ పెడుతున్నారు. 'తంగలాన్' చిత్రం పా.రంజిత్ దర్శకత్వంలో రూపొందుతోంది. కర్ణాటక, కోలార్ గోల్డ్ ఫీల్డ్స్‌లోని కార్మికుల జీవితాల చుట్టూ జరిగే వాస్తవిక ఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కుతున్నారు. ఇందులో విక్రమ్ ఓ తండాకు చెందిన వ్యక్తిగా కనిపించనున్నారు. భారతీయ, విదేశీ భాషల్లో 2డీ, 3డీలో ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. 2024 జనవరి 26న ప్రేక్షకుల ముందుకొస్తుందీ సినిమా.



# బచ్చులమల్లిలో అల్లరి నరేశ

టాలీవుడ్ దిగ్గజ దర్శకుడు దివంగత ఈవీవీ సత్యనారాయణ  తనయుడిగా ఎంట్రీ ఇచ్చి సినీ ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందారు హీరో అల్లరి నరేష్. తొలి ప్రయత్నంలోనే 'అల్లరి'తో హిట్ కొట్టి.. సినిమా పేరునే ఇంటి పేరుగా మార్చుకున్నారు. అయితే కొంతకాలంగా ఆయన సీరియస్ కథలపై దృష్టిపెట్టారు. ఈ క్రమంలో 'నాంది', 'ఉగ్రం', 'ఇట్లు మారేడుమిల్లి' చిత్రాలు చేశారు. ఇప్పుడు 'సోలో బ్రతుకే సో బెటరు' ఫేం సుబ్బు దర్శకత్వంలో ఒక సినిమా చేస్తున్నాడు. 'బచ్చల మల్లి' అనే టైటిల్‌తో రానున్న ఈ సినిమా కూడా సీరియస్ బ్యాక్‌డ్రాప్‌లోనే ఉంటుండగా.. తుని ప్రాంతంలో జరిగిన కొన్ని యదార్థ సంఘటనల స్ఫూర్తితో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారని సమాచారం. ఈ ప్రాజెక్ట్ శుక్రవారం అఫీషియల్‌గా లాంఛ్ అయ్యింది. ఈ వేడుకకు అనిల్ రావిపూడి ముఖ్య అతిథిగా వచ్చి ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ ఇచ్చారు. ఇక అల్లరి నరేశ్‌కి ఇది 62వ చిత్రం. ఈ సినిమా కథ 1990 నేపథ్యంలో ఉండబోతుంది. రావు రమేశ్, హరితేజ, ప్రవీణ్ తదితరులు నటిస్తున్న ఈ సినిమాను హాస్యా మూవీస్ పతాకంపై రాజేశ్ దండా, బాలాజీ గుత్తా నిర్మిస్తున్నారు. ఇందులో నరేష్ కి జోడీగా అమృత అయ్యర్ కనిపించనుంది



# యానిమల్‌లో హింసపాళ్లు మరీ ఎక్కువే

## ప్రేక్షకులను పిచ్చెక్కించేలా సీన్స్

'యానిమల్' సినిమా తండ్రి కొడుకుల మధ్య వున్న అనుబంధం, భావోద్వేగాల మధ్య నడుమ సాగే ఒక కథ. కానీ దర్శకుడు సందీప్ ఈ కథని చాలా హింసాత్మకంగా, కర్స్ పదాలతో కొంచెం సాగదీసినట్టుగా చెప్పాడు. రణబీర్ అత్యుత్తమ ప్రతిభ కనపరిచాడు అలాగే రష్మిక మందన్న కూడా. రణబీర్ అభిమానులకి ఈ సినిమా నచ్చే అవకాశం వుంది, కుటుంబంతో చూడటంలో కొంచెం ఇబ్బంది పడతారు. రష్మిక మందన్న ఇందులో కథానాయకురాలు, అనిల్ కపూర్, బాబీ డియోల్ ముఖ్య పాత్రలు పోషించారు. కరన్ విజయ్ సింగ్ (రణబీర్ కపూర్) కి తండ్రి బలబీర్ సింగ్ (అనిల్ కపూర్) అంటే చిన్నప్పటి నుంచి చాలా ఇష్టం. తండ్రి పుట్టినరోజు నాడు తండ్రికి శుభాకాంక్షలు చెప్పడానికి స్కూల్ నుండి ఇంటికి వచ్చి తండ్రి కోసం ఇల్లు, ఫ్యాక్టరీ అంతా తిరుగుతాడు కానీ, తండ్రి వ్యాపారవేత్త కావటంతో కుమారుడికి సమయం కేటాయించలేకపోతాడు. అక్కడ నుండి విజయ్ జీవితం మొదలవుతుంది, ఇక కుటుంబంని తనే చూసుకోవాలని అనుకుంటాడు. అందుకే కాలేజీలో తన సిస్టర్‌ని ఎవడో చెయ్యి పట్టుకున్నాడు అని తెలిసి కాలేజీకి గన్ పట్టుకెళ్లి బెదిరించి వాళ్ళందరినీ కొడతాడు. కుటుంబ సభ్యులకు ఎటువంటి ఆపద వచ్చినా, విజయ్ ఎంతటి దూరం అయినా వెళతాడు. తండ్రి కొడుకు ప్రవర్తన చూసి వాడు పెద్ద క్రిమినల్ అని, ఎలా తయారవుతాడో అని ఇంటి నుండి వెళ్లిపొమ్మంటాడు. గీతాంజలి (రష్మిక మందన్న) అనే అమ్మాయిని పెళ్లి చేసుకొని ఇద్దరు పిల్లలతో అమెరికాలో ఉన్న విజయ్ తండ్రి మీద ఎవరో మర్డర్ చెయ్యడానికి ప్రయత్నించారని ఇండియా వచ్చాడు? అప్పుడు విజయ్ ఏమి చేసాడు, ఎలా తండ్రిని కాపాడుకున్నాడు? బాబీ డియోల్ కి విజయ్ కి ఏంటి వైరం? తండ్రి బలబీర్ మీద ఎవరు దాడి చేశారు? ఇవన్నీ తెలుసుకోవాలంటే 'యానిమాల్' చూడాల్సిందే. దర్శకుడు సందీప్ రెడ్డి ఇంతకు ముందు విజయ్ దేవరకొండ కథానాయకుడిగా 'అర్జున్ రెడ్డి' చేసాడు. అదే సినిమాని హిందీలో రీమేక్ చేసాడు. రెండూ ఘన విజయం సాధించాయి.

# రౌడీవేర్ బ్రాండ్‌లో రష్మిక

సోషల్ మీడియాలో టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తోన్న భామల్లో టాప్‌లో ఉంటుంది కన్నడ సోయగం రష్మిక మందన్నా.  పుష్ప సినిమాతో సూపర్ పాపులారిటీ సంపాదించుకున్న రష్మిక కొన్ని రోజులుగా నెట్టింట డిఫరెంట్ గెటప్స్‌లో కనువిందు చేస్తుందని తెలిసిందే. దీనిక్కారణమేంటో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. రణ్‌బీర్ కపూర్  టైటిల్ రోల్‌లో నటించిన యానిమల్‌లో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించింది రష్మిక మందన్నా. రష్మిక మందన్నా, విజయ్ దేవరకొండ క్రేజీ కాంబో గురించి ప్రత్యేకించి చెప్పనవసరం లేదు.
గీతగోవిందం, డియర్ కామ్రేడ్ సినిమాలతో హిట్ పెయిర్‌గా నిలిచిన ఈ ఇద్దరు.. ఆఫ్ స్క్రీన్‌లో కూడా మంచి అనుబంధాన్ని కొనసాగిస్తారని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. విజయ్ దేవరకొండ ఫ్యామిలీతో కూడా సూపర్ బాండింగ్ కొనసాగిస్తుంది రష్మిక. కాగా ఎప్పటికప్పుడు నెటిజన్లు, మూవీ లవర్స్‌లో టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తుంటారు రష్మికా-విజయ్ దేవరకొండ. విజయ్ దేవరకొండ హోం బ్రాండ్ రౌడీ వేర్ (ఖీనీలిటా లి।జీస)కు మార్కెట్‌లో ఏ రేంజ్‌లో పాపులారిటీ ఉంటుందో తెలిసిందే. ఇప్పుడిదే రౌడీ వేర్‌లో కనిపించి నెట్టింట టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తోంది రష్మిక .స్టైలిష్ బ్లాక్ గాగుల్స్ పెట్టుకున్న రష్మిక మందన్నా రౌడీ వేర్ బ్రాండ్ హుడీ వేసుకొని.. ఎయిర్‌పోర్టులో నుంచి వస్తున్న విజువల్స్ హల్ చల్ చేస్తున్నాయి. రష్మిక మందన్నా.. ఏంటీ సంగతి అంటూ తెగ ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు నెటిజన్లు. రణ్‌బీర్‌కపూర్ అవార్డు విన్నింగ్ పర్‌ఫార్మెన్స్‌తో అదరగొట్టేశాడని ఇప్పటివరకు వచ్చిన టాక్ చెబుతోంది. ఇక తన పాత్రకు పోసే రష్మిక మందన్నా ఎప్పటిలాగే గీతాంజలి సింగ్ పాత్రలో జీవించేసిందని అంటున్నారు సినీ జనాలు. రష్మిక మందన్నా ప్రస్తుతం పుష్ప ది రూల్‌లో నటిస్తోంది. మరోవైపు ఫీ మేల్ సెంట్రిక్ కథాంశంతో సినిమా కూడా చేస్తోంది. ఈ సినిమాకు రెయిన్ బో టైటిల్ ఫిక్స్ చేశారు. ఇప్పటికే లాంఛ్ చేసిన టైటిల్ పోస్టర్ నెట్టింట్లో వైరల్ అవుతోంది. ఈ బైలింగ్యువల్ ప్రాజెక్ట్‌కు శాంతరూబన్ దర్శకత్వం వహిస్తున్నాడు. డ్రీమ్ వారియర్స్ పిక్చర్స్ పతాకంపై ఎస్.ఆర్ ప్రభు, ఎస్.ఆర్ ప్రకాష్ బాబు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.






# మంథని బరిలో గెలుపెవరిది?

## కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే ప్రధాన పోటీ
## గెలుపోటములను ప్రభావితం చేయనున్న బీఎస్పీ అభ్యర్థి
## నియోజక వర్గంలో 83శాతం పోలింగ్ నమోదు

**వరంగల్ వాయిస్, మల్హర్ :** మంథని అసెంబ్లీ నియోజక వర్గంలో శుక్రవారం జరిగిన సాధారణ ఎన్నికల్లో 82.74 శాతం పోలింగ్ నమోదైంది. నియోజక వర్గంలో మొత్తం 2,36,442 ఓట్లకు గాను 1,95,635 ఓట్లు నమోదయ్యాయి. మండలాల వారీగా రామగిరి మండలంలో 36,783 ఓట్లకు గాను 27,656 ఓట్లు, మాన్ పూర్ మండలంలో 19,760 ట్లకు గాను 16,793, పాలకుర్తి మండలంలో 8023ఓట్లకు గాను 6240, మంథని మండలంలో 47,823 ఓట్లకు గాను 39,953 ఓట్లు, కాటారం మండలంలో 29,624 ఓట్లకు గాను 24,258, మహా దేవ పూర్ మండలంలో 24,589 ఓట్లకు గాను 21,069, పలిమెల మండలంలో 5373 ఓట్లకు గాను 4880, మహా ముత్తారం మండలంలో 20,184 ఓట్లకు గాను 17,753, మల్హర్ మండలంలో 21,893 ఓట్లకు గాను 18,431, మంథని ముత్తారం మండలంలో 22,390 ఓట్లకు గాను 18,602 ఓట్లు పోలయ్యాయి. నియోజక వర్గంలో సాయంత్రం 4గంటలకే పోలింగ్ సమయం ముగిసినప్పటికీ ఓటర్లు భారీ ఎత్తున లైన్లలో నిలబడటంతో పోలింగ్ సమయాన్ని అధికారులు పెంచి లైన్ లో ఉన్న అందరికీ ఓట్ హక్కు కల్పించారు. మల్హర్ మండలం కొండంపేటలో రాత్రి 8గంటల వరకు పోలింగ్ కొనసాగింది. నియోజక వర్గంలో మొత్తం 21మంది అభ్యర్థులు పోటీలో ఉండగా ప్రధాన పార్టీల అభ్యర్థుల మధ్యే పోటీ నెలకొంది. కాంగ్రెస్ నుంచి శ్రీధర్ బాబు, బీఆర్ఎస్ నుంచి పుట్ట మధు, బీజేపీ నుంచి సునీల్ రెడ్డి, బీఎస్పీ నుంచి నారాయణ రెడ్డి పోటీ చేసినప్పటికీ బీజేపీ, బీఎస్పీ అభ్యర్థులు ప్రచారంలో అంతగా ముందుకు వెళ్లకపోవడంతో చివరికి కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థుల మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. బీఎస్పీ నుంచి పోటీ చేసిన చల్లా నారాయణ రెడ్డి తూర్పు మండలాలు అయిన కాటారం, మహాదేవ పూర్, పలిమెల, మహా ముత్తారం, మల్హర్ మండలాల్లో ప్రభావం చూపడంతో ఆయనకు వచ్చే ఓట్లు కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థుల విజయాలను తారుమారు చేసే అవకాశం ఉంది. బీఎస్పీ నుంచి పోటీ చేసిన చల్లా నారాయణ రెడ్డి గతంలో కాంగ్రెస్ లో ప్రధాన నాయకుడిగా ఉండి, 2019లో అధికార బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ నుంచి టికెట్ ఆశించి రాకపోవడంతో చివరికి బీ ఎస్పీ తరుపున బరిలో నిలిచాడు. ఇప్పుడు బీఎస్పీకి పడిన ఓట్లు కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులలో ఎవరి తల రాతని మరుస్తాయో అని మంథని నియోజక వర్గ ప్రజలు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. రెండు ప్రధాన పార్టీలలో గతంలో ప్రధాన లీడర్ గా పని చేసిన నారాయణ రెడ్డి ఏ పార్టీ ఓట్లు చీలుస్తాడు అన్న విషయం మీదే కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపోటములు ఆధారపడి ఉన్నాయి. ఓటర్ల మనోగతం పోలింగ్ జరిగిన విధానాన్ని పరిశీలిస్తే స్వల్ప మెజారిటీతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఐదవ సారి మంథని నుంచి ఎమ్మెల్యే గా ఎన్నికయ్యే అవకాశాలు కనిపిస్తున్న నువ్వా నేనా అన్నట్టు జరిగిన ఎన్నికల్లో చివరికి అంతిమ విజయం ఎవరిని వరిస్తుందో తెలవాలంటే 3 వరకు ఆగాల్సిందే.





# జనగామలో బీఆర్ఎస్ గెలుపు తథ్యం

## పల్లా రాజేశ్వర్ రెడ్డి ధీమా

**వరంగల్ వాయిస్, జనగామ :** జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో జనగామ జిల్లా జడ్పీ చైర్మన్, జిల్లా పార్టీ అధ్యక్షుడు పాగాల సంపత్ రెడ్డి అధ్యక్షతనవిలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో జనగామ జిల్లా ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ 45రోజులుగా పార్టీ కార్యకర్తలంతా ఐక్యంగా పని చేశారు. ఎన్ని బేధాభిప్రాయాలు ఉన్నా పార్టీకి కట్టుబడి నిలబడ్డారు. ఐక్యంగా ఉండి జనగామలో బీఆర్ఎస్ ను గెలిపించుకోబోతున్నామని తెలిపారు. రాత్రనక, పగలక పార్టీ కోసం పని చేసిన శ్రేణులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రణాళికబద్ధంగా ప్రచారం జరిగిందని, 131 గ్రామాలు, రెండు పట్టణాలు, 8మండల కేంద్రాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రచారం నేతల ద్వారా చేశామని పేర్కొన్నారు. పట్టణంలో మేధావులు, న్యాయవాదులు, డాక్టర్లు అంతా నా వైపు ఏకపక్షంగా ఉన్నారని తెలిపారు. చాలా గౌరవప్రదంగా బీఆర్ఎస్ పార్టీ గెలవబోతుందని ధీమా వ్యక్తం చేశారు. ఇందులో ఎవరికీ అనుమానం కూడా లేదన్నారు. ఓటర్లను ప్రతిపక్షాలు ప్రలోభ పెట్టాలని, బెదిరించాలని చూసినా విచక్షణతో ఓటేశారని సంతోషం వ్యక్తం చేశారు. జనగామలో గెలుపు తథ్యమనే నమ్మకం ఉందన్నారు. ప్రభుత్వం మీద టీచర్లు, ఉద్యోగులకు కొంత బేధ భావం ఉన్నప్పటికీ నాకు చాలా మంది సలహాలు, సూచనలు ఇచ్చారని చెప్పారు. కాలికి బలపం కట్టుకొని పార్టీ కార్యకర్తలు పని చేశారని కొనియాడారు. నా నమ్మకాన్ని ప్రజలు వమ్ము చేయట్లేదని అనుకుంటున్నానని తెలిపారు. ప్రచారంలో భాగంగా నేను ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తానని చెప్పారు. ఇతర జిల్లాల నుంచి మిత్రులు వచ్చి నా కోసం పని చేశారని తెలిపారు. బీజేపీ తాడు బొంగరం లేని పార్టీ.. చిన్న పిల్లలాడిగా బీజేపీ అభ్యర్థి.. విజ్ఞతతో ఉండాల్సింది పోయి కార్యకర్తలతో కలిసి మా కార్యకర్తను కొట్టారని మండిపడ్డారు. ఏదైనా జరిగితే ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయకుండా భౌతిక దాడులకు దిగారు. కార్యలర్తలపై దాడి చేసిన వారిపై కేసులు పెట్టామన్నారు. చర్యలు తీసుకునేలా చూస్తామని, ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. మేమేం భౌతిక




దాడులకు దిగలేదని, నిర్భయంగా ఆలోచించి మా గెలుపులో ప్రజల గెలుపు ఉంటుందన్నారు. జిల్లా అధ్యక్షుడు సంపత్ రెడ్డి మాట్లాడుతూ జనగామ నియోజకవర్గ అభ్యర్థి పల్లా రాజేశ్వర్ రెడ్డి భారీ మెజారిటీతో గెలవబోతున్నారని పేర్కొన్నారు. జనగామ జిల్లాలోని మూడు నియోజకవర్గాలు స్టేషన్ ఘన్ పూర్ పాలకుర్తి జనగామ నియోజకవర్గాలు మంచి మెజారిటీతో ముగ్గురు అభ్యర్థులు గెలుస్తున్నారని ముందుగానే ముగ్గురికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని అన్నారు. ఈ సమావేశంలో స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే రాష్ట్ర రైతుబంధు చైర్మన్ తాటికొండ రాజయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ పోకల జమున లింగయ్య, మార్కెట్ చైర్మన్ బాల్దె సిద్ధిలింగం, రైతుబంధు సమితి అధ్యక్షుడు ఇర్రి రమణారెడ్డి, నిమ్మతి మహేందర్ రెడ్డి, పసుల ఏబెల్ ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పాలకుర్తి నియోజకవర్గ ప్రజలకు ధన్యవాదాలు

## కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి యశస్విని రెడ్డి



**వరంగల్ వాయిస్, పాలకుర్తి :** గత రెండు నెలలుగా జరుగుతున్న ఎన్నికల ప్రక్రియలో భాగంగా పాలకుర్తి గడ్డమీద కాంగ్రెస్ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్క కార్యకర్త తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు, ప్రతి నాయకునికి పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి యశస్విని రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఓటు హక్కు ను వినియోగించుకున్న పాలకుర్తి నియోజకవర్గ ప్రజలందరికీ పేరుపేరునా నమస్కారాలు తెలియజేశారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com